క్లుప్తంగా

వరి పంటల పరిశీలన



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): రైతులు కష్ట పడి వేసిన పంటలను తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవడానికి వ్యవసాయ అధికారుల సూచనలను తప్పక పాటించాలని ఏఈఓ రాముడు అన్నారు. బుధవారం మండలంలోని అమ్మపల్లి శివారులో గల వరి పంటలను ఏఈఓ రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు పంటలకు రసాయనిక ఎరువులను పిచికారీ చేసేటప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మందులనే వాడాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



పాన్‌గల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయ ఆలయానికి నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన మంగదొడ్డి వేణుగోపాల్‌యాదవ్ రూ. 50 వేల విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా విరాళం అందజేయడంపై ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, బలవర్ధన్‌రెడ్డి, చిక్కేపల్లి సర్పంచ్ బాలస్వామియాదవ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతురెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును బుధవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం సహాయనిధి మంజూరుతో కార్పొరేట్ ఆస్పత్రులల్లో వైద్యం చేయించుకోవచ్చన్నారు. చెక్కును మంజూరు చేయించిన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరసాగర్, చంద్రూనాయక్, దాసునాయక్, పీర్యానాయక్, దమోదర్‌రెడ్డి, గోపాల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, ఈశ్వరయ్య, శేఖర్‌రెడ్డి, రమేష్‌నాయక్, శంకర్ నాయక్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఈదమ్మ బోనాలు



పాన్‌గల్: ఈదమ్మ దేవత ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మహిళలు బోనాలను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. దీంతో పాటు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించి గుడిచుట్టూ తిప్పారు. ఉత్సవాలకు వచ్చిన ఆడ పిల్లలకు గాజులు వేయించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. దీంతో గాజుల దుకాణాలు మహిళలతో నిండిపోయాయి. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగన్న గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీదర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాముయాదవ్ పాల్గొన్నారు.

మటన్ మార్కెట్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

వీపనగండ్ల: ఆర్థికంగా వెనకబడ్డ ఆరె కటికెల కులవృత్తిని దెబ్బతీసే మటన్ మార్కెట్ ఏర్పాటు అంశాన్ని ఉపసంహరించుకోవాలని మండల ఆరెకటికె సంఘం అధ్యక్షుడు శివాజీ, నాయకులు శంకర్‌జీ, బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో మటన్ మార్కెట్ల ఏర్పాటుకు పూనుకుంటే వాటి నిర్వాహణ కోసం ఆరె కటికెలకే లైసెన్సులు ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా వెనకబడి ఆరెకటికలను బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆరె కటికెలను ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి రూ.5లక్షల షరతులు లేని రుణాలు మంజూరు చేయాలని, లేకుంటే ఐక్య ఆరెకటిక ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ శ్రీనివాసులు, సవారీ శ్రీను, లక్ష్మోజీ, బాలకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మాందాపూర్‌లోని వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి 9వ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య నూతనంగా నిర్మించిన రైస్ మిల్లును ఎమ్మెల్యే ప్రారంభించారు.

కూలీలతో ముచ్చట్లు

ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న దారిలో వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్న కూలీలు కనిపించడంతో కారు ఆపి కొద్దిసేపు వారితో ముచ్చటించారు. పనులు ఎలా ఉన్నాయి.. ఉపాధి బాగానే లభిస్తుందా అని ఆరా తీశారు. గతంలో సాగునీరు రానప్పుడు ఇబ్బందులు ఉండేవి అని ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా లభిస్తుండటంతో కూలీ పనులు బాగానే దొరుకుతున్నాయని కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీరన్న చెరువుకు మినీ లిఫ్ట్ ద్వారా భీమా కాల్వ నుంచి సాగునీటితో నింపడంతో ప్రస్తుతం రెండు పంటలు పండుతున్నట్లు కూలీలు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన లచ్చగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెండటంతో బుధవారం ఆయన దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరై చిత్రపటానికి పూలతో నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ ఎల్లస్వామి



వీపనగండ్లలో..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ప్రభుత్వం పంపిణీ చేసున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీటీసీ ఎల్లస్వామి అన్నారు. బుదవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వారు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణ, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పాలు, పప్పు, బాలమృతం అందిస్తుందని తెలిపారు. అర్హులందరికీ పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిషోర్, అంగన్‌వాడీ టీచర్ మంజులారాని, మహిళాసంఘం నాయకురాళ్లు అనురాధ, రైమాబేగం, ఆశావర్కర్స్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని మహిళలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ నర్సింహారెడ్డితో కలిసి బాలామృతం, గుడ్లు, పౌష్టికాహారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి ఉన్నారు.

బడ్జెట్‌పై అభిప్రాయాలు

పేదలకు అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఎలాంటి ఊరట లభించలేదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్ రూపొందించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడు, గుడ్డ, ఇల్లు లేని పేదలు నేటికీ ఉన్నారు. అలాంటి వారి ఆర్థిక పురో గతికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. విలాస వస్తువులకు ఇచ్చిన ప్రాధాన్యత పేదల అభ్యున్నతిపై దృష్టి పెట్టలేదు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరు చూస్తే కార్పొరేట్ల కోసమే రూపకల్పన చేశారనిపిస్తుంది.

– జగదీశ్, మదనాపురం

రిటైర్డ్ ఉద్యోగులకు ఊరట



ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు కొంత ఊరట లభించింది. చాలీచాలని పింఛన్.. విపరీతంగా పెరుగుతున్న ధరలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. బడ్జెట్‌లో సవరించిన టాక్స్ శ్లాబ్ రేట్ల వల్ల లక్షలాది మంది విశ్రాంత ఉద్యోగులకు ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు.

– రాఘవాచారి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, శ్రీరంగాపురం

విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనాలి



విద్యార్థులకు డ్రస్సులను అందజేస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): సామాజిక సేవలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లోని ఎస్‌పీసీ (స్కూల్ పోలీస్ క్యాడెట్)కు సంబంధించిన 8వ తరగతి జూనియర్ బాలబాలికలకు 44మందికి డ్రస్సులు, బూట్లు, బెల్టులు, టోపీలు, టైలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ప్రతి విద్యార్థి సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని, తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజ్యాంగ విలువలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచి సత్ప్రవర్తనతో ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాదేవి, ఫిజికల్ డైరెక్టర్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోలీసులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెబ్బేరు: మండలంలోని బునాదిపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌యూటీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శులు శ్రీనివాసరావు, మైనోద్దీన్, ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వీఆర్‌ఏల మౌనదీక్షకు తరలిరండి

అమరచింత: జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించే వీఆర్‌ఏల మౌనదీక్షకు మండలంలోని వీఆర్‌ఏలు తరలిరావాలని మండల వీఆర్‌ఏల జేఏసీ కన్వీనర్, కోకన్వీనర్‌లు మహిమూద్, మునిస్వామి కోరారు. వీఆర్‌ఏల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 2న జిల్లా కేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం చేపట్టే మౌనదీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. దీక్షలో పాల్గొనేందుకు అనుమతించాలంటూ తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు.

3న అజ్మీర్ దర్గా చాదర్ ఊరేగింపు

అమరచింత: అజ్మీర్ దర్గా షరీఫ్‌కు మండల కేంద్రం నుంచి ఫిబ్రవరి 3న చాదర్‌ను భక్తిశ్రద్ధలతో తరలించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మజీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనలో వనపర్తి జిల్లాగా, అమరచింత మండలం ఏర్పడాలని అజ్మీర్ దర్గా షరీఫ్‌కు మొక్కుకున్నామన్నారు. మండలంతో పాటు జిల్లా ఏర్పడటంతో ఆనాటి నుంచి ప్రతి ఏటా అజ్మీర్ దర్గాకు చాదర్‌ను క్రమం తప్పకుండా పంపుతున్నామని తెలిపారు. శుక్రవారం రాజవలీ దర్గా నుంచి చాదర్ ఊరేగింపుతో పాటు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



వీపనగండ్లలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న యువకులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని వైఎస్ ఎంపీపీ బాల్‌రెడ్డి కోరారు. మస్తీపురంలో నిర్వహిస్తున్న శిబిరంలో 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయంచుకోవాలని బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ కవిత ప్రారంభించారు. మాందాపూర్, పాన్‌గల్‌లో గ్రామాలతో కలిపి మొత్తం 526 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. వీరిలో 38 మందికి కంటి అద్దాలు, 14 మందికి కంటి ఆపరేషన్ కోసం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం నుంచి వెంగళాయిపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తామని డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింధూజ, ఎంపీఓ రఘురాములు, దేవేందర్‌నాయుడు, దశరథనాయుడు, వాల్మీకినాయుడు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రంలో తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము కంటి పరీక్షలు చేయించుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి శిబిరంలో అవసరమైన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను వెంటనే పంపిణీ చేస్తున్నట్లు మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు.

368 మందికి కంటి పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం మొత్తం 368 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని సోళీపురంలో 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 10 మందికి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు ఇద్దరికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని వెనికితండాలో మొత్తం 214 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 14 మందికి కంటి అద్దాలు, ఏడుగురికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష పాల్గొన్నారు.

107 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని శేరుపల్లి పంచాయతీ కార్యాలయంలో 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో ఇద్దరికి రీడింగ్ అద్దాలను అందించి, ఐదుగురికి అవసరమైన అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఏడుగురికి ఆపరేషన్ కోసం సిఫార్సు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



సోళీపురంలో..



బుసిరెడ్డిపల్లిలో..



మస్తీపురంలో..

అభివృద్ధిని ప్రతి గడపకు వివరించండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గంలో తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను గడప గడపకు వివరించి వారిని చైతన్యం చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మండలంలోని చింతకుంట, మల్లాయిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గంలో తన హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా సాగునీరు, విద్య, వైద్యం వంటి పనులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని తెలిపారు. అయినా కొంత మంది నాయకులు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని తిప్పికొట్టేందుకు మనం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించిన రూ.కోట్లు నిధులను రద్దు చేయించిన ఘనత నేటి ఎమ్మెల్యే దని ఎద్దేవా చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన లచ్చగౌడ్ దశదిన కర్మలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, గోవర్ధన్‌సాగర్, భాస్కర్‌యాదవ్, బ్రహ్మయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

వీపనగండ్ల: మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాలలకు కేటాయించిన నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీఓ కతలప్ప, మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలతో పాటు సంగినేనిపల్లి పాఠశాలలో చేపడుతున్న పనులను వారు పరిశీలించారు. పాఠశాల నిధుల ద్వారా పనులు పూర్తయిన పాఠశాలలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందున పెండింగ్ పనుల్లో జాప్యాన్ని సహించలేమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎమ్మార్సీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలీశ్వరయ్య, స్వప్న, విద్యాకమిటీ చైర్మన్ రామచంద్రయ్య, ఎత్తం బాలస్వామి, సీఆర్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు భవన కార్మికులకు వర్తించవా?



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు వర్తించవా? అని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రం నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్, తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. రంగురంగుల భవనాలను నిర్మించే మేస్త్రీలకు, కూలీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని విచారించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. జిల్లా ఏర్పడి ఆరేళ్లు దాటినా లేబర్ ఆఫీస్‌లో సరిపడ అధికారులు లేకపోవడంతో పనులు జరగడం లేదని వాపోయారు. గతేడాది రెగ్యులర్ లేబర్ అధికారి ఏఎల్‌ఓ వచ్చి దరఖాస్తులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లోని దరఖాస్తులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీను, నాగరాజు, బుచ్చన్న, రమేష్, సత్యనారాయణ, అయ్యప్ప, అంజి, నాగేష్, టి. వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న వీజేఆర్ ఫౌండేషన్ వలంటీర్లు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రైవేట్‌కు ధీటుగా రాణించాలన్నదే వీజేఆర్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వలంటీర్లు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరు పేపర్లకు అనుగుణంగా ప్రముఖ విద్యా నిపుణులచే స్టడీ మెటీరియల్ రూపొందించినట్లు తెలిపారు. రూ.20లక్షల వ్యయంతో 3,500 ఇంగ్లిష్ మీడియం, 1,500 తెలుగు మీడియం స్టడీ మెటీరియల్ బుక్కులను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం లక్ష్మీదేవి, వలంటీర్లు అనిల్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు పద్మజ, జమున, జ్యోతి, లలిత, సభసుల్తాన, ఫాజీయా, స్వాతి, మానాస, ఇందిరాదేవి, సురేఖ, వరలక్ష్మి, రాజేశ్వరి, శ్వేత, సుగుణ, అలివేలమ్మ, విద్యార్థులు ఉన్నారు.

సైన్స్ పరిజ్ఞానం వెలికితీసేందుకే సైన్స్ ఫేయిర్



విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌మేళాను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

చిన్నంబావి: విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికితీయడం కోసం సైన్స్ ఫేయిర్ ఎంతో ఉపయోగపడుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని దగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామిక వికాస కేంద్రం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ ఫేయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, గ్రామిక వికాస కేంద్రం డైరెక్టర్ లక్ష్మణరావు విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విదార్థుల ప్రతిభను వెలికితీయడం కోసం ఏర్పాటు చేసిన ఈ మండల స్థాయి సైన్స్‌మేళ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మండల స్థాయి సైన్స్‌ఫేయిర్‌లో మొదటి బహుమతి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అయ్యవారిపల్లి, పెద్దదగడ పాఠశాలలు, ద్వితీయ బహుమతి కేజీబీవీ పాఠశాలకు, తృతీయ బహుమతి దగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సువర్ణ కుర్మయ్య, ఉపసర్పంచ్ గంగాదర్, అయ్యవారిపల్లి గ్రామ రామస్వామి, కొప్పునూరు హైస్కూల్ చైర్మన్ నరసింహ, హెచ్‌ఎం బెక్కం గోవిందు, తిరుపాలు, మీసాల మహేశ్, హైమావతి, సుమతి, బాలకృష్ణ, ప్రవీణ్‌గౌడ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పెబ్బేరు: రంగాపూర్‌లోని చింతల వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ధ్వజస్తంభ, నవగ్రహాలు, బొడ్రాళ్లు, గండదీప ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గరుడపూజ, ధనుర్లగ్న శుభపుష్కరాంషమున, మహాయంత్రం స్థాపన, బొడ్రాళ్ల ప్రతిష్ఠ, ద్వార పాలక, నవగ్రహా, గణపతి, గరుడ, బలిపీఠ, నాగ, గండ దీప కార్యక్రమం నిర్వహించారు. కుంభ నివేదనం, పూర్ణాహుతి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య మేళాతాలతో బొడ్రాళ్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆడపడుచులకు నూతన వస్త్రాలు, వడిబియ్యం వడ్డించారు. కార్యక్రమంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, సర్పంచ్ గట్టయ్య, నాయకులు కృష్ణారెడ్డి, రాంచంద్రారెడ్డి, చంద్రశేఖర్, వాసుదేవారెడ్డి, భరత్‌కుమార్, హనుమన్న, రమేష్, కురుమన్న, యల్లస్వామి, రాములు, భగవంతు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.